


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**నేను ఒక్కొక్కటే** రాసివ్వటం, వారు దాన్ని చిత్రంగా నిర్మించి ఆణిముత్యాలు పేరుతో దూరదర్శన్ లో ప్రసారం చేయటం జరిగింది. ఆ చిత్రాల్లో శ్రీయుతులు గుమ్మడి, రాళ్ళపల్లి, మహర్షి రాఘవ, శ్రీమతులు కిన్నెర, బెంగుళూరు పద్మ వంటి ప్రముఖ సినీనటులు ఎందరో నటించారు. సదరు ఆణిముత్యాలు శీర్షికన ఆ చిత్రాలు మొన్నమొన్నటివరకూ దూరదర్శన్ కేంద్రం కనీసం పదిహేనుసార్లయినా పునః ప్రసారం చేసింది.

1996 లోనే దూరదర్శన్లో నేను రచించిన పునరపి అనే పదిభాగాల ధారావాహిక ప్రసారమైంది. దూరదర్శన్ వారే ' కమిషన్' చేసిన ఈ ధారావాహికలో శ్రీయుతులు సుబ్బరాయశర్మ, అచ్యుత్, కోట శంకర్రావు, శరత్ కుమార్, నిట్టల శ్రీరామమూర్తి, శరత్ చంద్రారెడ్డి, ఇంకా సుమ, ఉష, జ్యోతిరెడ్డి మొదలైన తారాగణమంతా పాల్గొని మంచి పేరు తీసుకొచ్చారు. మా రెండో అబ్బాయి శ్రీధర్ దీనికి దర్శకత్వం వహించాడు.

ఉత్తమ టెలీ ప్లే రచయితగా నాకూ, ఉత్తమ తొలి దర్శకునిగా మా శ్రీధర్, ఉత్తమ విలన్ గా శ్రీ కోట శంకర్రావులు ఆ సంవత్సరానికి ఉత్తమ టి.వి. నంది పురస్కారాలు అందుకున్నారు. ఈ ధారావాహికను కూడా పదిసార్లకు పైగా పునః ప్రసారం చేసింది దూరదర్శన్ కేంద్రం.

అంతేకాకుండా మధురాంతకం రాజారాం గారు రచించిన ఆరు కథల్ని తీసుకుని శ్రీ జయదేవరెడ్డిగారు నాచేత లఘు చిత్రాలుగా రాయించి దూరదర్శన్ ద్వారా ప్రసారం గావించారు. అలాగే శ్రీ జె.వి. సోమయాజులుగారి సమర్పణలో ఆరు భర్తృహరి సుభాషిత పద్యాల్ని ఎంపిక చేసుకుని, వాటిని రాగభావయుక్తంగా డా. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంగారితో చదివించి ఆ పద్యాలకు నాచేత కథలూ, సంభాషణలూ రాయించి లఘుచిత్రాలుగా ప్రసారం చేయించారు. ప్రముఖ సినీ దర్శకులు శ్రీ పి.సాంబశివరావుగారు దర్శకత్వం వహించిన ఈ సుభాషిత కథలకుగాను 2005 లో నాకు ఉత్తమ కథా రచయితగా నంది పురస్కారం లభించింది.

ఇక ఇటీవలికాలంలో అంటే 2010-2015 మధ్యకాలంలో డా. రావూరి భరద్వాజగారు లోగడ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్న జీవన సమరం వాస్తవ గాథల్ని-శ్రీ మురళీమోహన్ గారి వ్యాఖ్యానంతో రూపొందింప చేయటంతోపాటు భరద్వాజగారే స్మృతి సాహిత్యం  పేరుతో తమ శ్రీమతి కాంతమ్మ గారి జ్ఞాపకాల్ని అయిదు పుస్తకాలుగా రచించగా వాటిని ఆధారంగా తీసుకుని 'అంతరంగిణి' పేరుతో ఎనిమిది భాగాలుగా ఒక ధారావాహికను రాయించి దూరదర్శన్ అధికారులు ప్రసారం చేశారు.

ఈ ధారావాహికల సంగతి అటుంచితే- నాటకాలు కూడా ఎన్నో నేను రాసినవి ప్రసారం చేశారు. రేడియోకి రాసిన అనేక నాటకాల్లోంచి, కొన్ని నాటకాల్ని టీవీలో ప్రసారానికై తిరగరాసి ఇస్తే దూరదర్శన్ లోని నాటక విభాగ ఆధిపతులైన శ్రీయుతులు గోవిందచౌదరి, చక్రవర్తి, రాజశేఖర్ మున్నగువారు-వాటిని ఆదరించి దూరదర్శన్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్ళి దూరదర్శన్ నాటక రచయితగా కూడా నాకొక గుర్తింపును కలిగించారు. మొత్తానికి నా దూరదర్శన్ ప్రస్థానంలో ఆ కేంద్రం ఆధిపతులైన శ్రీమతి శైలజాసుమన్, డా. పి. మధుసూదనరావులతోపాటు, అందులోనే ప్రధాన పదవులలో వున్న శ్రీయుతులు ఓలేటి పార్వతీశం, సత్యవోలు సుందరసాయి నా వెన్నంటి ప్రోత్సహించారు. వారికి సదా కృతజ్ఞుడిగా వుంటాను.

నేను ప్రాప్తాన్ని నమ్ముతాను! దేని కోసమూ ఎప్పుడూ తాపత్రయపడలేదు. 1997 లో నాకు 58 సంవత్సరాలు నిండి (అఫిషియల్ గా) ఆకాశవాణి పదవినుంచి రిటైర్ కావాల్సి వుంది. అయితే అదే సమయానికి కొన్ని నెలలముందు, కేంద్ర ప్రభుత్వ వుద్యోగుల వయో పరిమితిని మరో రెండు సంవత్సరాలు పెంచుతున్నారనీ అందుకు సంబంధించిన ఫైలు ఢిల్లీ సెక్రటేరియట్ లో సిద్ధంగా వున్నదని వార్తలు వచ్చాయి! మరో రెండేళ్ళు ఉద్యోగం చేసుకోవచ్చు కదా అని సంబరపడ్డాను. అయితే ఆ ఫైలు మీద వెంటనే సంతకం కాలేదు.

ఈలోగా నా వయస్సు 58 సంవత్సరాలు నిండిపోయింది. నేను పదవీ విరమణ చేసేశాను. ఆ తర్వాత ఓ నెలరోజులకు అమెరికాలో వుంటున్న నా పిల్లల కోరికమీద భార్యా సమేతంగా ఆ దేశం వెళ్ళి మూడు నెలలపాటు వాళ్ళింట్లో గడిపి ఇండియాకి తిరిగి వచ్చాను. అన్నట్లు చెప్పటం మరిచాను. నేనూ, నా భార్యా అమెరికా వెళ్ళటం ఇది రెండవసారి.

మొదటిసారి 1996 లోనే వెళ్ళాం. అప్పుడు మా అబ్బాయిలు ఇద్దరూ ఆ దేశంలోని అనేక రాష్ట్రాలకు కార్లో తిప్పాడు. వాషింగ్టన్ లో ప్రెసిడెంటు నివసించే వైట్ హౌస్ నీ, నయాగరాలోని వాటర్ ఫాల్స్ నీ, పిట్స్ బర్గ్ లోని బాలాజీ ఆలయాన్ని, న్యూయార్క్ లోని లిబర్టీ స్టాచ్యూనీ, వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాన్ని ఇంకా మరికొన్ని ముఖ్య ప్రదేశాల్ని మాకు చూపించారు.

సరే, రెండోసారి అమెరికా వెళ్ళి వచ్చిన తర్వాత ఓ నెలరోజులకు అనుకుంటాను. మధ్యాహ్నం వేళ నాకు 'ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్' నించి ఫోనొచ్చింది.

"నేను చైర్మన్ గారి పి.ఏ.నండీ" అన్నారు ఆవతలి వ్యక్తి అపుడు శ్రీ మురళీ మోహన్ గారు ఎఫ్ డి.సి.కి ఛైర్మన్ గా వుండేవారు. "చెప్పండి" అన్నాను నేను. "ఓసారి ఆఫీసుకి రాగలరా?" అని అడిగారాయన.

ఇదివరలో నేను దూరదర్శన్ కోసం రాసిన డాక్యుమెంటరీ చిత్రాలలోనూ, ధారావాహికల్లోనూ ఆయన నటించి వున్న కారణంగా 'మళ్ళీ అలాంటి ధారావాహిక ఏదైనా తయారు చేయమని అడగటానికి కబురు పెట్టారేమో' అనుకున్నాను.

వస్తున్నానని చెప్పి వెంటనే-వారి కార్యాలయానికి వెళ్ళాను. ఆ సంస్థ మేనేజింగు డైరెక్టర్ గారి గదిలోకి తీసుకెళ్ళారు పి.ఎ.గారు. ఆ గదిలో ఎమ్.డి. కిషన్ రావు గారితోపాటు, మురళీమోహన్ గారూ, దర్శకేంద్రులు శ్రీ రాఘవేంద్రరావుగారు కూర్చుని వున్నారు.

నేను లోపలకు వెళ్లగానే-అందరికీ నమస్కరించాను. అయిదు నిమిషాలు ఆ మాటా ఈ మాటా అయ్యాక అసలు మాట చెప్పారు."ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి, ప్రత్యేక కార్యక్రమాల గురించీ రేడియో ద్వారా ప్రజలకు తెలియపరచాలని అనుకుంటున్నాం. మీకు వీలవుతుందా?"-అని అడిగారు.

"నేను రిటైర్ అయిపోయాను కదండీ!"-అన్నాను.

"అందుకే మిమ్మల్ని పిలిచాం ... మీరు అంగీకరిస్తే మా స్టేట్ గవర్నమెంట్ మీకు కాంట్రాక్టు ఇస్తుంది .."-అన్నారు మురళీ మోహన్ గారు,

1993 లోనే నేను అలాంటి కార్యక్రమాలు దూరదర్శన్ లో ప్రసారం కోసం రాసి వున్నవాళ్లే కనక-'చేస్తానండీ' అన్నాను.

"మీకు రెమ్యూనరేషన్ ఎంత కావాలో-ఆ వివరాలన్నీ ఇన్ఫర్మేషన్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ గారితో మాట్లాడుకోండి" అన్నారాయన.

ఆవిధంగా 1998 నుంచీ 2004 వరకూ, అంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నంతవరకూ-దాదాపు ఆరున్నర సంవత్సరాల కాలం, ఎలక్ట్రానిక్ మీడియాలో శ్రీ కె. రాఘవేంద్రరావుగారు అడ్వైజర్ గా వున్నంతకాలం నేను రేడియో కో-ఆర్డినేటర్ గా పనిచేశాను. ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలోనే మాకు రెండు గదులు

కేటాయించారు. నాతోబాటు ఇంకా ఆ మీడియాలో శ్రీయుతులు జె.వి.ఎల్. నారాయణ, జి.కె. మోహన్, పి.సత్యనారాయణ, ముఖర్జీ (సినీ నిర్మాత) ప్రభృతులు పనిచేసేవారు.

మేమంతా తరచుగా ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారింట్లో కలుసుకుని మీడియా చేస్తున్న కార్యక్రమాల గురించి చర్చించుకునే వాళ్ళం.

నేను "మీడియా కో-ఆర్డినేటరు'గా పదవీ బాధ్యతలు చేపట్టిన కొత్తలో-ఓ సందర్భాన సెక్రటేరియట్ లో శ్రీ చంద్రబాబుగారు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారులంతా ఆ సమావేశానికి వచ్చారు.

"రేడియోలో ఎలాంటి కార్యక్రమాలు చేయాలనుకుంటున్నారూ? "-అని నన్నడిగారు ముఖ్యమంత్రిగారు.

అప్పటికే బహుళ ప్రజాదరణ పొందిన కార్మికుల కార్యక్రమంలో చిన్నక్క ఏకాంబరం బాలయ్యల కబుర్లు 'వంటి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆ మూడు పాత్రల బదులు వేరే పేర్లతో (సుబ్బులు మామ, రమణయ్య బావ, వసంతమ్మ) మొదట కొంత హాస్యంతో ప్రారంభించి, చివరకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమం గురించో ప్రారంభించిన పథకం గురించే ప్రజలకు (శ్రోతలకు) తెలియపరచేలా కబుర్లు చెప్తే బాగుంటుందేమో' అని సూచన చేశాను.

సమావేశంలో వున్న అధికార ప్రముఖులందరూ- "అదే బాగుంటుందన్నారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్ కి సోపానాలు' పేరుతో ప్రతి బుధవారం ఉదయం 7 గంటల15 ని॥లకు ఓ పావుగంటపాటు ఆ కార్యక్రమాన్ని అంతకాలమూ ప్రసారం చేశాను.

రేడియోలో ఆ పావుగంట మాకు కేటాయించినందుకు అక్కడి వాణిజ్య విభాగానికి కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వారు చెల్లించేవారు. ఈ' కబుర్లు 'కార్యక్రమంలో పాల్గొనటానికి- అప్పటికే రేడియోలో ఆర్టిస్టులుగా మంచి పేరు తెచ్చుకుని, నేను నిర్వహించిన అనేక నాటకాల్లో పాల్గొన్న శ్రీయుతులు సుబ్బరాయశర్మ, పి. రమణారెడ్డి, శ్రీమతి ఎ. వసంతలక్ష్మి గార్లను ఎంపిక చేసుకున్నాను.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర్లో వున్న ఓ ప్రయివేటు ఆడియో స్టూడియోలో వారి కబుర్లను రికార్డు చేసి ఆ టేపుల్ని వారం వారం ఆకాశవాణి అధికారులకు అందచేసేవాళ్ళం.ఈ కార్యక్రమం ఒక్కటే కాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాల గురించి, ప్రారంభించిన పథకాల గురించి కూడా డాక్యుమెంటరీ రూపకాలు తయారుచేసి వాటిని కూడా రేడియోద్వారా ప్రసారం గావించే వాళ్ళం!

రేడియో కార్యక్రమాలను నేను తయారు చేస్తుంటే- టీవీలో ప్రసారం కోసం వేర్వేరు కార్యక్రమాలను రూపొందించే పనిలో శ్రీ రాఘవేంద్రరావుగారు చాలామంది సహాయాన్ని తీసుకునేవారు. వారిలో శ్రీ ఎస్.ఎస్. రాజమౌళి, శ్రీ వర

ముఖ్యులు. అప్పటికి వారిద్దరూ సినిమా రంగానికి పరిచయం కాబడలేదు. ఆ సినిమారంగ పరిచయాన్ని కూడా దర్శకేంద్రులే వారికి కలిగించారు.

ఇంతకీ ఇక్కడ చెప్పొచ్చేదేమిటంటే-కేంద్ర ప్రభుత్వోద్యోగుల వయోపరిమితిని నేను రిటైర్ కాకముందే, అరవై సంవత్సరాలకు పొడిగించివుంటే నేను 60 ఏళ్ళు నిండేవరకూ ఆకాశవాణిలోనే పనిచేసివుంటే ఈ ఆరేళ్ళ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు ఉద్యోగం నాకు దొరక్కపోయేది కదా? ... ఎంతో మంది ప్రభుత్వ ప్రముఖులతో నాకు పరిచయాలు లభించేవి కాదు కదా! .. అందుకే' ప్రాప్తం 'వుండాలంటారు.

ప్రాప్తం గురించి ఇక్కడ మరో సంఘటన కూడా మీతో పంచుకోవాలి. 1998 లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు సాహితీ పురస్కారాల కోసం రచనలను ఆహ్వానించారు. అప్పుడే నేను ప్రచురించుకున్న అమూల్యం అనే కథల సంపుటిని పురస్కార పరిశీలనకోసం పంపించాను. అప్పుడు నాకు పురస్కారం లభించలేదు. మళ్ళీ సంవత్సరంలో కూడా అవే రచనల్ని పంపే అవకాశం వుండటంతో 1999 వ సంవత్సరంలో అదే పుస్తకాన్ని పరిశీలనకు పంపుకున్నాను. ఆ సంవత్సరం నా కథల సంపుటిని ఉత్తమ రచనగా ఎంపికచేసి 20 వేల నూట పదహార్లు పురస్కారంగా అందజేశారు.

ఆ సంవత్సరమే ఆ మొత్తాన్ని అలా పెంచారు. 1998 వరకూ ఆ పురస్కారం క్రింద పదివేలు మాత్రమే ఇచ్చేవారు. ఇది కూడా' ప్రాప్తం'గానే భావిస్తాను.

ఇంకా చెప్పాలంటే అలాంటి అవకాశాలు ఇంకా ఎన్నో నాకు ప్రాప్తించాయి. నేను ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తుండగానే, రాష్ట్ర ప్రభుత్వం బాలల చిత్రాల్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో బాలల' సినిమా రచనల ఆహ్వాన కమిటీ' నొకదాన్ని ఏర్పాటుచేసి, అందులో సభ్యునిగా నన్ను నియమించింది. ఈ సభ్యత్వం రెండు సంవత్సరాలు కొనసాగింది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన నంది నాటకోత్సవాల్లో రాష్ట్రం నలుమూలలనుంచీ నాటికలనూ నాటకాలనూ ఆహ్వానించి వాటిని ప్రాథమికంగా పరిశీలించి, ప్రదర్శనకు అనుకూలంగా వుండే వాటిని ఎంపిక చేయటానికి ప్రతిఏటా కమిటీలను ఏర్పాటు చేసేది. అలా ఏర్పాటు చేసిన కమిటీలలో నేను సభ్యునిగా మూడు సంవత్సరాలు ప్రాథమిక పరిశీలన చేయటం-రెండుసార్లు తుది పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించటం జరిగింది.

మీడియా కో-ఆర్డినేటర్ గా పనిచేస్తూనే ఒకరోజు శ్రీ రాఘవేంద్రరావుగారు ఓ టీవీ ఛానల్ కోసం సీరియల్ నిర్మిస్తూ దాని ప్రారంభోత్సవానికి నన్ను కూడా రమ్మన్నారు.

'జూబ్లీహిల్స్'లో వున్న ఓ ప్రైవేట్ బంగళాలో షూటింగ్ ప్రారంభమైంది. ఆరోజు ఆలా ప్రారంభోత్సవం ముగిసిన తర్వాత మళ్ళీ తమ ఆఫీసుకి తిరిగివస్తూ తమ కార్లోనే కూర్చోమన్నారు. కూర్చున్నాను. కొన్ని నిమిషాల తర్వాత "మీరు సీరియల్స్ కి సంభాషణలు రాయగలరా? "–అని నన్ను అడిగారు.

అప్పటికే దూరదర్శన్ లో ప్రసాదం కోసం రెండు ధారావాహికలు రాసి వున్నవాణ్ణి. అయితే ఆ విషయం ఆయనకి తెలీదు. ఎందుకంటే అప్పటిదాకా ఆయన మదరాసులోనే సినీ దర్శకునిగా వుండేవారు. అందువల్ల నా సీరియల్ రచనా వ్యాసంగం గురించి ఆయనకు తెలియకపోవచ్చుననుకున్నాను.

'రాయగలనండి' అని ఆయనకు జవాబు చెప్పి–లోగడ నేను రాసిన సీరియల్స్ గురించి వివరించాను.

"అయితే ఇవాళ ప్రారంభం చేసిన' సీరియల్ కి మీరు 'డైలాగ్స్ రాయండి' " అన్నారు ఆయన. ఆ సీరియల్ పేరు మనోయజ్ఞం! దీనికి ప్రత్యేకించి సెంటిమెంటల్ సంభాషణలు రాయటానికి నన్ను పెట్టుకుని, హాస్య సంభాషణలు రచించేందుకు శ్రీ వెంకటేష్ బాబు అనే మరో రచయితను తీసుకున్నారు. ఇదో రకమైన అనుభవంగా నేను చెప్పుకుంటాను. షూటింగ్ అయ్యే దృశ్యాలను ఏరోజుకారోజు తెల్లవారుఝామునే లేచి రాసి ఉదయం ఎనిమిది గంటలకల్లా దర్శకేంద్రులుండే గెస్ట్ హౌస్ కి వెళ్ళి చదివి వినిపించేవాణ్ణి. అలా నలభై భాగాలకు నేను కొన్ని సంభాషణలు రాసాను.

కొన్ని కళాశాలల్లోనూ విశ్వవిద్యాలయాల్లోనూ రంగస్థల కళలకు సంబంధించి ప్రత్యేక శాఖలు పనిచేస్తాయని మీలో చాలామందికి తెలిసే వుంటుంది. అలా ఏర్పాటైన రంగస్థల కళల విభాగాలు హైదరాబాద్ నిజాం కళాశాలలోనూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ, భీమవరంలోని రాజుగారి కళాశాలలోనూ వున్న రంగస్థల కళల శాఖల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు–రంగస్థల నాటకాలు ఎలా రాయాలో, రేడియో నాటకాలు ఎలా రాయాలో, రేడియోకి వర్తాలు ఎలా రాసి చదవాలో మొదలైన అంశాల గురించి బోధించే అవకాశాన్ని ఆయా సంస్థల అధిపతులైన శ్రీయుతులు జి.ఎస్.ప్రసాదరెడ్డి, దేవదాస్ కనకాల, కామేశ్వరరావు, ప్రభృతులు నాకు ఇవ్వటం ఒక అదృష్టంగా భావించాను.

అంతేకాదు ఒకప్పుడు 'టీవీ –5' ఛానల్ ను ప్రారంభించాలని–ఆ ఛానల్లో పనిచేయటానికి కావలసిన సిబ్బందిని ఎంపిక చేసుకుని, ఆ సంస్థ నిర్వాహకులు స్క్రిప్టులు ఎలా తయారు చేసుకోవాలి, ఎట్లా ప్రెజంట్ 'చేయాలి మొదలైన అంశాల గురించి ఆ సిబ్బందికి నాతో కొన్ని వారాలపాటు శిక్షణ ఇప్పించే అవకాశం కూడా నాకు కల్పించారు.

పైన చెప్పినవన్నీ నా ప్రాప్తానికి సంబంధించినవే తప్ప– నేను ప్రయత్నించగా లభించిన అవకాశాలు కానేకావు!

1996 లో ఒకసారి, 1997 లో రెండవసారి అమెరికా దేశం చుట్టి వచ్చాననీ చెప్పాను కదా! 1999లో మూడవసారి వెళ్ళవలసి వచ్చింది. ఎలక్ట్రానిక్ మీడియాలోనే పనిచేస్తున్న ముఖర్జీ గారు అమెరికా వెడుతూ నన్ను కూడా రమ్మని అడిగారు. అప్పటికి నా శ్రీమతి ఓ నెలరోజుల ముందే అమెరికా వెళ్ళి న్యూజెర్సీలో వున్న నా చిన్న కుమారుని ఇంట్లో వుంది. ఇపుడు నేను కూడా వెడితే ఓ నెలరోజులు అక్కడ గడిపి రావచ్చు కదా అని ముఖర్జీ గారితో ప్రయాణమయ్యాను. అప్పట్లో 'ఇజ్రాయెల్ ఎయిర్ లైన్స్' అనే విమానయాన సంస్థ న్యూజెర్సీకి డైరెక్టుగా విమానాలు నడుపుతోందనీ, టిక్కెట్టు అతిచౌకగా, పోనూ రాసూ ముప్పయి వేలకే వస్తోందని ముఖర్జీ గారు చెప్పటంతో ఆయనతోపాటే నేను కూడా అదే విమానానికి టిక్కెట్టు తీసుకున్నాను.

ముందుగా బొంబాయి చేరుకుని, అక్కడినుంచి సుమారు 14 గంటలు అందులోనే ప్రయాణం చేసిన తర్వాత, విమానంలో మాకెదురుగా వున్న పెద్ద టీవీలో విమానం ఎంత ఎత్తున ఎగురుతున్నదీ, ఏ ప్రాంతాన్ని సమీపించిందీ మొదలైన వివరాలు తెలుపుతూ, ట్రాకింగ్ కనిపిస్తూండగా ఇంక పావుగంట వ్యవధిలో న్యూజెర్సీలో 'ల్యాండ్ 'అవుతున్నట్టు ప్రకటన వినిపించింది. కానీ విండో లోంచి చూస్తుంటే చుట్టూ మబ్బులున్నట్టు తెలిసింది. విమానం పైకీ కిందకూ ఎగురుతున్నట్లు అనిపించింది. కుదుపులు కూడా ఎక్కువయ్యాయి. పావుగంట కాదు కదా గంటయినా 'ల్యాండ్' కాలేదు. విమానం లోపల ఎయిర్ హెస్టెస్'లూ, తదితర సిబ్బందీ అటూ ఇటూ ఖంగారుగా తిరుగుతున్నారు. ఏవేవో ప్రకటనలు వినిపిస్తున్నాయి. ఆ భాష మాకు అర్థం కాలేదు. ఏదో జరగరానిది జరుగుతున్నట్టు కూడా అనిపించింది. నా పక్కన కూర్చున్న తల్లీ కూతుళ్ళెవరో ఆందోళన పడుతున్నట్టు గ్రహించాను.

లోపల మంచినీళ్ళు అయిపోయాయి. ఎవరో ఒక ప్రయాణీకుడు వాంతి చేసుకున్నాడు. "ఇక మా పని అయిపోయిందని పించింది! విమానం మాత్రం ఆకాశంలోనే ఒక్కసారిగా క్రిందకు రావటం-మళ్ళీ పైకి వెళ్ళటం జరుగుతోంది. నేను ఏడుకొండల వెంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ కళ్ళు మూసుకున్నాను. నిజం చెప్తున్నాను .. అదే ఆఖరి రోజనుకున్నాను.

విండోలోంచి అప్పుడప్పుడు బయటకు చూస్తున్నాను. అంతలో దూరంగా వెలుగుతున్న దీపాలు కనిపించాయి. నేను ఆశగా, సంబరంగా" దేర్! లైట్స్! "అంటూ అరిచాను.

అందరూ అటు చూశారు. మరో పావుగంటకి నెమ్మదిగా మా విమానం'ల్యాండ్' అయ్యింది. అందరం చప్పట్లు కొడుతూ కేబిన్ లోంచి బయటకు వచ్చిన 'పైలట్స'ను చుట్టుముట్టి

" పైలట్స్! యూ ఆర్ గ్రేట్! "అంటూ వారికి ఆనందంగా షేక్ హ్యాండ్లిచ్చాం! ***( కొనసాగింపు వచ్చేనెలలో)***